ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి



ఎం.సూర్యప్రకాష్ (ఆర్.డి.ఓ)

అబిడ్స్: ఓటరు నమోదును అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని హైదరాబాద్ జిల్లా ఆర్.డి.ఓ ఎం.సూర్యప్రకాష్ పేర్కొన్నారు. ఓటు హక్కు ఎంతో విలువైందని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటర్ లిస్టులలో తమ పేర్లు లేని వారు తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. శనివారం గోషామహల్, నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాలతో పాటు పలు ప్రాంతాల్లో ఆర్.డి.ఓ సూర్యప్రకాష్ పర్యటించి పోలింగ్ బూత్‌లో కొనసాగుతున్న ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ..స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటర్ల నమోదు కార్యక్రమం శనివారం, ఆదివారాలలో నియోజకవర్గాల్లోని అన్ని పోలింగ్ స్టేషన్లలో నిర్వహిస్తున్నమన్నారు. ఫిబ్రవరి 8న ఓటర్ లిస్టులో తుది జాబితా విడుదలవుతుందని వివరించారు. శనివారం కొనసాగుతున్న ఓటర్ల నమోదు ప్రక్రియను తమ ఆర్.డి.ఓ పరిధిలోని అన్ని కేంద్రాలనను తహసీల్దార్‌లతో పాటు జీహెచ్ఎంసీ, ఇతర సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని ఆయన తెలిపారు. పోలింగ్ స్టేషన్‌కు వచ్చేవారికి ఎలాంటి సలహాలు సూచనలు కావాలన్నా సిబ్బంది వారికి ఓటర్ల నమోదుపై తగిన సమాచారం ఇచ్చి అవగాహన కల్పిస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

కేంద్రాలపై దృష్టిసారించాలి

నాంపల్లి: రాబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన ఓటరు జాబితా సవరణపై కాంగ్రెస్ నేతలు ప్రత్యేక దృష్టిని సారించారు. నాంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్ ఫిరోజ్ ఖాన్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ కార్యకర్తలు, నేతలు ప్రత్యేక ఓటరు జాబితా సవరణ శిబిరాలను సందర్శించారు. శనివారం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఎర్రబెల్లి దుర్గేశ్వర్ నేతృత్వంలో పలువురు కాంగ్రెస్ నాయకులు మల్లేపల్లి డివిజన్‌లోని 45 పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటరు జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలపై వచ్చిన అభ్యంతరాలను అక్కడి బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు ఎస్.లక్ష్మణ్‌లాల్, పృథ్వీరాజ్, తీరత్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.



ఓటరు సవరణ జాబితాను పరిశీలిస్తున్న ఎర్రబెల్లి దుర్గేశ్వర్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గౌలిపురా: ప్రత్యేక సమ్మరి రివిజన్–2024 కార్యక్రమంలో భాగంగా ఓటరు నమోదు, అభ్యంతరాలు, సవరణలకు ఈ నెల 20, 21వ తేదీ అని ఓటర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ సూచించారు. శనివారం చార్మినార్ నియోజకవర్గంలోని పలు పోలింగ్ కేంద్రాలను వెంకటేశ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బూత్‌స్థాయి అధికారులు క్రియాశీలంగా వ్యవహరించి తప్పులు లేకుండా ఓటరు జాబితాను తయారు చేయాలన్నారు. ఓటర్ జాబితాలో పేర్లు లేని పక్షంలో ఈఆర్ఓ, ఏఈఆర్ఓలుగా వ్యవహరిస్తున్న అధికారులను సంప్రదించాలని.. వెబ్‌సైట్, ఓటర్ హెల్ప్‌లైన్‌లో తిరిగి నమోదు చేసుకోవాలన్నారు.

పోలింగ్‌స్టేషన్లను పర్యవేక్షించిన డీఎంసీ బాలయ్య



అబిడ్స్: పోలింగ్‌స్టేషన్‌లో అబిడ్స్–14వ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ బి.బాలయ్య పర్యవేక్షించారు. గోషామహల్, జాంబాగ్‌లతో పాటు పలు ప్రాంతాల్లోని పోలింగ్‌స్టేషన్లలో ఆయన పర్యవేక్షించి ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలయ్య మాట్లాడుతూ..శనివారం, ఆదివారం గోషామహల్ నియోజకవర్గంలోని అన్ని పోలింగ్‌స్టేషన్లలో ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. 18 ఏళ్లు నిండినవారితో పాటు కొత్తగా ఓటర్లు నమోదు అయ్యేవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చిరునామాలో మార్పు, ఓటరు లిస్టులో తప్పొప్పులు ఉంటే సవరణలు చేస్తామని, అందరు దరఖాస్తు చేసుకోవచ్చని బాలయ్య సూచించారు.

స్వచ్ఛ తీర్థ్ అభియాన్‌లో భాగంగా ఆలయం శుభ్రం



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న నాయకులు

గౌలిపురా: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం గౌలిపురా సీబీటీ క్వార్టర్స్‌లోని నల్ల పోచమ్మ ఆలయం పరిసరాలను బీజేపీ నాయకులు చెత్తాచెదారాన్ని తొలగించి ఆలయాన్ని నీటితో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ మహేశ్, డి.యాదగిరి, మోకాళ్ల వెంకటేశ్, మహేంద్ర గిరి, మిద్దెల శివ కుమార్, అన్నపాక దయానంద్, పొట్టి సుధీర్, లింగాల రమేశ్, బాబురావు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

‘ఓర్వలేకనే కాంగ్రెస్‌పై కేటీఆర్ తప్పుడు ప్రచారాలు’



గౌరీ సతీష్

అబిడ్స్: కాంగ్రెస్ పార్టీ ప్రగతి, అభివృద్ధిని చూసి రాష్ట్ర బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీర్ణించుకోలేక అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని రాష్ట్ర పీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ పేర్కొన్నారు. పదేళ్లపాటు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చని బీఆర్ఎస్ పార్టీని ప్రజలు తరిమికొట్టినా కేటీఆర్‌కు గుణపాఠం రావడం లేదన్నారు. శనివారం తన కార్యాలయంలో గౌరీ సతీష్ విలేకర్లతో మాట్లాడుతూ..ప్రజా పాలన ద్వారా స్వీకరించిన అర్జీలను ప్రజలకు వెంటనే అమలు చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కేటీఆర్, హరీష్‌రావు ఇష్టం వచ్చినట్లు ప్రవర్తించినా ప్రజలు మాత్రం రాబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను మరోసారి చిత్తుగా ఓడిస్తారన్నారు. రాష్ట్రంలోని 16 ఎంపీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ విజయ ఢంకా మోగించడం ఖాయమన్నారు.

దీపావళి తరహా మహేష్‌నగర్‌లో అయోధ్య సంబరాలు



అయోధ్యకు తరలివెళ్తున్న వారిని సత్కరిస్తున్న దృశ్యం

అబిడ్స్: అయోధ్య సంబరాలు మహేష్‌నగర్ కాలనీలో దీపావళి తరహా ప్రతి ఇంటా చేపడుతామని మహేష్‌నగర్‌కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు పట్నం సుబ్బారావు, కార్యదర్శి న్యాయవాది రాజశేఖర్ వెల్లడించారు. ఈ నెల 22న అయోధ్యలో రామ్‌లాల్ ప్రతిష్టాపన వేడుకలను మహేష్‌నగర్ కాలనీ నుంచి శనివారం ఆర్ఎస్ఎస్, హిందూ సంఘ్, బీజేపీ నాయకులు గౌరిగె శ్రీనివాస్, ప్రమోద్‌కుమార్, ప్రశాంత్‌కుమార్, నరేందర్ ఠాకూర్, పి.నర్సింగ్, నరేష్ తరలి వెళ్లారు. తరలివెళ్లిన నాయకులను పట్నం సుబ్బారావు, రాజశేఖర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..సోమవారం మహేష్‌నగర్ కాలనీలోని ప్రతి ఇంటిలో దీపావళి సబరాలు నిర్వహించే విధంగా అందరూ కృషి చేయాలన్నారు. 500 ఏళ్ల నాటి హిందువుల కల నెరవేరుస్తున్న సందర్భంగా కాలనీవాసులంతా సాయంత్రం వేళ ఐదు దీపాలు వెలిగించి దీపావళి శోభ కలిగే విధంగా కాలనీ అంతా శోభాయమానంగా కావాలన్నారు.

ఎరుకల కులస్తులకు న్యాయం చేస్తాం



భట్టి విక్రమార్కకు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

గోల్కొండ: తెలంగాణలో ఎరుకల కులస్తులకు తప్పకుండా న్యాయం చేస్తామని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్ర ఎరుకల సంఘం నాయకులు శనివారం ఆయనను కలిశారు. పదేళ్లుగా ఎరుకల కులస్తులకు న్యాయం జరగలేదని, బీఆర్ఎస్ ప్రభుత్వం ఎరుకల అభివృద్ధికి ఏమాత్రం చొరవ చూపలేదని ఎరుకుల కులస్తులు ఉపముఖ్యమంత్రి దృష్టికి తెచ్చారు. తప్పకుండా ఎరుకల సోదరులకు న్యాయం చేస్తామని వారి హక్కుల పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా తనను కలిసిన వారితో ఉపముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఎరుకుల సంఘం ప్రతినిధులు ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం అధ్యక్షుడు కెంబసారం కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కృష్ణ, కె.విజయ్‌కుమార్, బాబురావు, భుజంగరావు తదితరులున్నారు.

అక్రమ పార్కింగ్‌లతో పరేషాన్

- పాతబస్తీలో ఎక్కడ పడితే అక్కడే పార్కింగ్
- ఆటోలకు అందుబాటులో లేని నిర్దేశిత పార్కింగ్‌లు
- రోడ్లపై నిలిచిపోతున్న ఇతర వాహనాలు



మక్కా మసీదు రోడ్డులోని ప్యారిస్ కేఫ్ చౌరస్తాలోని రోడ్డులో అడ్డదిడ్డంగా ఆటోలు

చార్మినార్: పాతబస్తీలో అక్రమ పార్కింగ్‌లు ట్రాఫిక్ జామ్‌కు కారణమవుతున్నాయి. గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ నుంచి మదీనా చౌరస్తా వరకు ఈ అక్రమ పార్కింగ్‌లు ఇతర వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఆటో డ్రైవర్లు ప్రధాన రోడ్లపైనే తమ ఆటోలను నిలిపి వేస్తుండడంతో ఇతర వాహనదారులు పడరాని పాట్లు పడుతున్నారు. సాధారణ రోజుల్లో రోజుకు ఐదారు వేల వరకు ఆటో రిక్షాలు మదీనా చౌరస్తా ద్వారా గుల్జార్‌హౌజ్ మీదుగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నట్లు ట్రాఫిక్ పోలీసుల తనిఖీలలో స్పష్టమైంది. ఇక ఈ సంఖ్య వీకెండ్ రోజుల్లో మరీ ఎక్కువగా ఉంటుందని సంబంధిత ట్రాఫిక్ అధికారి ఒకరు తెలిపారు.

సరైన పార్కింగ్ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో..

- పాతబస్తీలో ఇతర వాహనాలతో పాటు ఆటోలకు సరైన పార్కింగ్ స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- కీలకమైన కూడలిలో నిర్దిష్టమైన పార్కింగ్‌లు అందుబాటులో లేవు. దీంతో తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడే రోడ్లపై నిలిచిపోతుండడంతో వాహనదారులు, పాదచారులు, ఆర్టీసీ ప్రయాణీకులు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.
- ఆటోరిక్షాలపై ఆంక్షలు విధిస్తున్న సంబంధిత ట్రాఫిక్ పోలీసులు, వాటిని ఎక్కడ నిలపాలో నిర్దేశించడం లేదు.
- ప్రజలకు ఆర్టీసీతో పాటు రవాణా సౌకర్యాన్ని అందజేస్తున్నామని.. తమకు అనుకూలమైన ప్రదేశంలో పార్కింగ్‌లను కేటాయించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

చౌరస్తాలలో తిష్టవేస్తున్న ఆటోలు..

- గుల్జార్‌హౌస్ చౌరస్తా, పంచ్‌మోహల్లా (ప్యారిస్ కేఫ్) చౌరస్తాలో ఆటోరిక్షాల అక్రమ పార్కింగ్‌లతో ప్రతిరోజు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.
- నగరం నుంచి చార్మినార్ వైపు వచ్చే వాహనాలతో (మొఘల్‌పురా ఫైర్ సర్వీస్ స్టేషన్ నుంచి ముందుకు వచ్చే వాహనాలన్నీ) పంచ్‌మోహల్లా చౌరస్తా ద్వారానే ముందుకు వెళ్లాలి.
- ఇలాంటి కీలకమైన కూడలిలో ఆటోరిక్షాలు తిష్ట వేయడంతో నిత్యం ట్రాఫిక్ జాంలు ఏర్పడుతున్నాయి.
- ముఖ్యంగా నగరం నుంచి పాతబస్తీకి వచ్చే ఆర్టీసీ బస్సులు ఈ చౌరస్తా ద్వారా ముందుకు వెళ్లలే కపోతున్నాయి. వీటిని క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది.
- నగరం నుంచి పాతబస్తీ చార్మినార్‌కు వచ్చే ఆటోరిక్షాలన్నీ గుల్జార్‌హౌస్ ఫౌంటేన్ ద్వారా తిరిగి నగరంలోని ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో గుల్జార్‌హౌస్ చౌరస్తా వద్ద ఆటోరిక్షాల పార్కింగ్ కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలం లేకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఇక్కడ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాల్సిన అవసరముందని ఆటోరిక్షా డ్రైవర్లు కోరుతున్నారు.

ఆటో పార్కింగ్ సమస్యను పరిష్కరించండి...

- పాతబస్తీలోని పలు రద్దీ గల ప్రాంతాల్లో ఆటోరిక్షాల పార్కింగ్ సమస్య అధికంగా ఉంది.
- పర్యాటక ప్రాంతాలైన చార్మినార్, మక్కా మసీదు, సాలార్‌జంగ్ మ్యూజియం, చౌమహల్లా ప్యాలెస్, జూపార్కు తదితర ప్రాంతాల్లో ఆటోరిక్షాల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఏర్పాటు చేయాలని ఆటో రిక్షా డ్రైవర్లు కోరుతున్నారు.
- ప్రయాణికులు లభించే చోటే పార్కింగ్ ఏర్పాట్లు ఉంటే గిరాకీ బాగా ఉంటుందంటున్నారు. అలా కాకుండా ప్రయాణికులు లేని వేరే ప్రదేశంలో పార్కింగ్‌లు ఏర్పాటు చేస్తే ఆశించిన ఫలితాలుండవని..తమ జీవనోపాధికి ఇబ్బందులు తలెత్తుతాయంటున్నారు.

ఉత్సాహంగా ఫ్రెష్ వెజ్జీస్ డే



డబీర్‌పురా: మాస్టర్స్ గ్రూపు ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఫ్రెష్ వెజ్జీస్ డేను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు వివిధ రకాల కూరగాయల వేషధారణలతో పలువురిని విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కూరగాయలు తీసుకోవడంతో ఎన్ని రకాల ఉపయోగాలు ఉన్నాయనే విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఇ.శ్రీనివాస్ రావు, ప్రిన్సిపాల్ మాధవి, హేమలత, శ్రీదేవి పాల్గొన్నారు.

నేడు కొమురవెల్లి ఎల్లమ్మ తల్లికి బంగారు బోనం

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 21న కొమురవెల్లి ఎల్లమ్మ తల్లికి బంగారు పాత్రలోని బోనాన్ని సమర్పించనున్నామని కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్ తెలిపారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ప్రతి ఏడాది కొమురవెల్లి మల్లన్న జాతరలో పాల్గొని ఎల్లమ్మకు బంగారు బోనంతో పాటు మల్లన్నకు వడి బియ్యం, పట్టువస్త్రాలు సమర్పించే ఆనవాయితీ ఉందని.. ఇందులో భాగంగా ఈ ఆదివారం సాయంత్రం 4 గంటలకు బంగారు బోనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. ముందుగా గౌలిపురా కోట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం కొమురవెల్లి బయలు దేరి వెళతామన్నారు.

ఎమ్మెల్యే కౌసర్‌కు సన్మానం



ఎమ్మెల్యే కౌసర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: తన సేవలను గుర్తించి కార్వాన్ నియోజకవర్గ ప్రజలు తనను మూడవ దఫా కూడా ఎమ్మెల్యేగా గెలిపించారని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఎమ్మెల్యేగా వరుసగా మూడు సార్లు విజయం సాధించి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయనను శనివారం పలు సంఘాల నాయకులు టోలిచౌకీలో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎక్కువ శాతం ప్రజలు నిరుపేదలేనని పేద కూలీలు ఎక్కువగా ఉండే ఈ నియోజకవర్గంలో అందరికీ అందుబాటులో ఉండి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాయనన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మజ్లిస్ నాయకులు యామీన్ తదితరులున్నారు.

విజయనగర్‌కాలనీలో శ్రీరామ కీర్తనలు

విజయనగర్‌కాలనీ: అయోధ్యలో రేపు బాలరామ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా విజయనగర్ కాలనీ పుర వీధులు శ్రీరామ నామ సంకీర్తనలతో మారుమ్రోగాయి. శనివారం విజయనగర్‌కాలనీ మహిళా మండలి ఆధ్వర్యంలో సీతారామలక్ష్మణ చిత్రపటం, కాషాయ జెండలు భాజా భజంత్రీలు, మేళ తాళాలలతో కాలనీ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో రంగశ్రీ, వరలక్ష్మీ, విజయ, పద్మ, రామలక్ష్మీలతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఫైలాన్‌కు మరమ్మతులు చేయాలి



బల్దియా జోనల్ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: నానల్‌నగర్ చౌరస్తాలోని కాంగ్రెస్ ఫైలాన్‌కు వెంటనే మరమ్మతులు నిర్వహించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో శనివారం బల్దియా జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం సమర్పించారు. 2006లో హైదరాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ ప్లీనరీ సందర్భంగా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసిందని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. పదేళ్లుగా దీనికి ఎటువంటి మరమ్మతులు జరగలేదని వెంటనే ఫైలాన్‌తో పాటు ప్లాట్‌ఫామ్‌కు కూడా మరమ్మతులు నిర్వహించాలని వారు కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు చంటిబాబు, అబ్దుల్ హమీద్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి



అవగాహన కల్పిస్తున్న సౌత్, ఈస్ట్ జోన్ ఏసీపీ సత్యనారాయణ

సంతోష్‌నగర్: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సౌత్, ఈస్ట్ జోన్ ఏసీపీ కె.సత్యనారాయణ సూచించారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని శనివారం ఐ.ఎస్.సదన్ చౌరస్తాలో ఆయన సంతోష్‌నగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఇ.నరసింహ నాయక్‌తో కలిసి వాహనదారులకు గులాబీ పువ్వును అందజేసి భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలకు మీ భర్తలు ఇంట్లో నుంచి బయటికి వెళ్లేటప్పుడు హెల్మెట్, లైసెన్స్‌లు కలిగి ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఏసీపీ సత్యనారాయణ మాట్లాడుతూ..కార్లు నడిపే వాహనదారులు తప్పకుండా సీటు బెల్టులు ధరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ రూల్స్ పాటించకపోతే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సైలు సత్యనారాయణ, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామమందిర ప్రారంభోత్సవ వీక్షణకు ఏర్పాట్లు



భూమిపూజలో పాల్గొన్న ఎంపీ లక్ష్మణ్

గన్‌ఫౌండ్రీ: అయోధ్యలో రామ మందిరం ప్రారంభం కోసం ప్రపంచం మొత్తం ఎదురు చూస్తుందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. శనివారం నిజాం కళాశాల మైదానంలో అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవ ప్రత్యేక్ష ప్రసారాల ఏర్పాట్లకు భూమిపూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..అయోధ్య రామ మందిరం దగ్గరకు అందరు ప్రత్యేక్షంగా వెళ్లలేరు కావున భూమిపూజతో ప్రత్యేక్ష ప్రసారాలను చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22న నిజాం కళాశాల మైదానంలో ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక్ష ప్రసారం ప్రారంభమవుతుందని ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు. బీజేపీ కార్యాలయ ఇన్‌చార్జ్ గోపాల్‌జీ, కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలి



వీరశైవ లింగాయత్‌ల డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. శనివారం రవీంద్ర భారతిలో తెలంగాణ రాష్ట్ర వీరశైవ లింగాయత్ సంఘం నూతన సంవత్సర కేలండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వీరశైవ లింగాయత్‌లను ఓబీసీ జాబితాలో చేర్చడం వల్ల ఎటువంటి నష్టం వాటిల్లదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం వీరశైవ లింగాయతులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ.. సమాజంలో కుల మతాలకు అతీతంగా అందరూ సమానమేనని బసవేశ్వరుడు చాటి చెప్పారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, లక్ష్మణ్, మాజీ పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కార్, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, వీర శైవ లింగాయత్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెన్న ఈశ్వరప్పతో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

నేడు, రేపు రామాలయంలో ప్రత్యేక పూజలు

డబీర్‌పురా: డబీర్‌పురా కోమటివాడిలోని రామాలయంలో ఈనెల 22న అయోధ్యలో శ్రీరామచంద్ర ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఉదయం అభిషేకం, అలంకరణ, హోమం నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. 22న సీతారాముల కల్యాణం, అనంతరం అన్నప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం



విగ్రహాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న మాధవీలత తదితరులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని శ్రీ సీతారామ మందిర్‌లో లతామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ నెల 22న అయోధ్యలోని శ్రీ భవ్య రామమందిరంలో రామలల్ల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఈ కల్యాణోత్సవాన్ని జరిపించారు. లతామా ఫౌండేషన్ చైర్మన్ మాధవీలత కొంపెల్ల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి విగ్రహ మూర్తులను ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట, చార్మినార్ డివిజన్ల ఏసీపీలు కె.మనోజ్ కుమార్, రుద్ర భాస్కర్, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గురునాథ్‌లతో పాటు స్థానికులు కృష్ణ, మాణిక్య, మహేందర్ రాజ్, శిల్ప, సుధీర్, పరాంకుశం దంపతుల చేతుల మీదుగా కల్యాణం జరిపించారు.

స్వామి వివేకానంద పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న పోసాని సుధాకర్

చార్మినార్: పాతబస్తీ లాల్‌దర్వాజకు చెందిన పోసాని సుధాకర్ స్వామి వివేకానంద సేవా పురస్కారం అందుకున్నారు. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఆసుపత్రిలో 30 ఏళ్లుగా హెర్బలిస్టుగా వైద్య విద్యార్థులకు సేవలు అందిస్తున్న ఆయనకు నవ భారతి నిర్మాణ ఫౌండేషన్ సంస్థ ద్వారా ప్రకటించిన ఈ పురస్కారాన్ని నగరంలో శుక్రవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీలు బండ ప్రకాష్, దయానంద్, సినీ నటులు బాబు మోహన్, తెలంగాణ మేధావుల ఫోరం అధ్యక్షులు డాక్టర్ రాజ్ నారాయణ్ ముదిరాజ్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షులు కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్ చేతుల మీదుగా అందుకున్నారు. శనివారం ఆయనను తన నివాసం వద్ద పలువురు అభినందించారు.

విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి తల్లిదండ్రుల సహకారం అవసరం



మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయురాలు పద్మజాకుమారి

అఫ్జల్‌గంజ్: విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయులకు తల్లిదండ్రుల సహకారం అవసరమని అఫ్జల్‌గంజ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజా కుమారి అన్నారు. శనివారం పాఠశాల ప్రాంగణంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, పదవ తరగతి పరీక్షలు జరిగే వరకు టీవీలకు, సినిమాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు పండితులు డాక్టర్ ఎస్. విజయ్ భాస్కర్, ఉపాధ్యాయులు బల్వంత్ రెడ్డి, అశోక్ బాబు, సుచరిత, బబిత, కౌసర్ ఫాతిమా, పీఈటీ ఎస్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

రమణీయం.. కూచిపూడి నృత్యం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య సంస్థ శ్రీ సిద్ధాకృష్ణ కూచిపూడి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నృత్యగురువు సుజాతమూర్తి శిష్యురాలు లలిత శ్రీయ కూచిపూడి రంగప్రవేశం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. గజనాట్యం, శంకర సిరిగిరి, భామ కలాపం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సినీ నటి మాడభూషి సబితా, నృత్యగురువు పద్మశ్రీ డాక్టర్ పద్మజారెడ్డి సాహితీవేత్త ఓలేటి పార్వతీశం, అన్నమాచార్య పాఠశాల ప్రిన్సిపల్ ఎస్‌వి.రమణామూర్తి, కర్ణాటక సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండలో రాములోరి అక్షింతల పంపిణీ



గోల్కొండ: ఈ నెల 22న ప్రతి హిందువూ తమ ఇంటిలో దీపాలను వెలిగించాలని గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి వృత్తి పని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయి బాబాచారి అన్నారు. శనివారం ఆయన గోల్కొండలో ఇంటింటికీ తిరిగి శ్రీరాముల వారి అక్షింతలను పంపిణీ చేశారు. ఆయన వెంట ఆలయ పూజారి బి.సురేష్‌చారి తదితరులు పాల్గొన్నారు.

నుమాయిష్‌లో రామ మందిర నమూనా కారు



అబిడ్స్: అయోధ్య రామ మందిర నమూనాతో తయారు చేసిన కారును నాంపల్లి ఎగ్జిబిషన్‌లో ప్రదర్శనకు ఉంచారు. నుమాయిష్ సందర్శనకు వచ్చే వారు అయోధ్య తరహాలో రామ మందిరాన్ని తిలకించేందుకు వీలుగా ఈ ప్రదర్శనను ఏర్పాటు చేశారు. బహదూర్‌పురా ప్రాంతానికి చెందిన సుధాకర్ యాదవ్, సుధాకర్స్ మూజియంను ఏర్పాటు చేసి సబ్జెక్ట్‌తో కూడిన కార్లను తయారు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌ను సాధించారు. కాగా అయోధ్య రామ మందిర నమూనాతో కూడిన కారును రెండేళ్లుగా శ్రమించి తయారు చేశారు. ఎగ్జిబిషన్ సొసైటీ విజ్ఞప్తి మేరకు ప్రదర్శనకు ఉంచగా శనివారం రాత్రి కారు ప్రదర్శనను నిర్వాహకులు సుధాకర్ యాదవ్, గాయిత్రి ఉపవాసకులు దైవాజ్ఞ శర్మ, ఎగ్జిబిషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు వనం సత్యేందర్, సెక్రటరీ హనుమంతరావు, జాయింట్ సెక్రెటరీ చంద్రజిత్ సింగ్, కోశాధికారి ఏనుగుల రాజేందర్ కుమార్, స్టాల్ అలాట్‌మెంట్ కన్వీనర్ ప్రభాకర్, పబ్లిసిటీ కన్వీనర్ జీవీ రంగారెడ్డి, డి.మోహన్, వనం సురేందర్, సురేందర్‌రెడ్డి, ధీరజ్ జైస్వాల్, ప్రేమ్ కుమార్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు.